# విశ్వదాభిరామం

యల్.పి.గోపీకృష్ణ



**"ఏమిటి? సింహాద్రి!**
**నీవు కూడా ఆ 'వేమన్న' మాటలు**
**వింటున్నావా, ఏమిటి?**
**అన్నాడు రాజారావు కసిగా నవ్వుతూ.**

"మంచి ఎవరు చెప్పినా వింటే తప్పేముంది వంతులుగారూ!" సింహాద్రి అన్నాడు.


"మంచట మంచి, వాడొక 'సెక్స్ పిచ్చోడు'. చెప్పేవన్నీ 'బూతు కథలు, బూతు వద్యాలు', జాగ్రత్త నమ్మి చెడేవ్" వెటకారంగా అన్నాడు రాజారావు.


"ఏమో బాబూ! మన వూరు మారుమూల నుంది. పట్నానికి వెళ్లాలంటే చాలా దవ్వు. బడి చెప్పేందుకు వచ్చిన 'వేమన్న వంతులే' ఈ వూరి పిల్లా, జెల్లాకు ఏమన్నా అయితే ఆయన దగ్గరున్న మందులిస్తాడు. ఎవరికైనా కష్టాలు, నష్టాలూ ఉంటే ఆయనకు తోచిన నలహా ఇస్తాడు. చేతనైన సాయం చేస్తాడు. నాలాంటి నన్నకారు రైతుకు కావలసిన నలహాలు కూడా ఇస్తూంటాడు. అందుకే అందరూ ఆయన దగ్గరకెళ్లేది" సింహాద్రి ఉన్నదున్నట్లు చెప్పాడు.

"కాస్తో కూస్తో చదువుకున్న నీవు కూడా వేమన్నను అలా వెనకేసుకు రాకు. అసలు వాడు చేసేది వైద్యమా? ఏవో నాలుగు మందుల పేర్లు తెలుసుకొని, అమాయకులను లొంగదీసుకున్నాడు. పైగా వాడు ఆడాళ్లను కూడా లొంగదీసుకునేరకం. వాడి గురించి నాకంతా తెలుసనుకో. కానీ, మన వూరి వాళ్లు నే చెబితే నమ్మిఛస్తేగా!" విచారం వ్యక్తంచేశు రాజారావు.

"అయినా 'వేమన్న వంతులు' అలాటోడంటే ఎవరూ నమ్మరు వంతులుగారూ! అయినా ఆయన అట్లాంటోడని మీకెలా తెలుసు? మీ ఇంట్లో అందమైన ఆడాళ్లెవరూ లేరు కదా!" అని నవ్వుతూ సింహాద్రి అక్కడ నుండి వెళ్లిపోయాడు. రాజారావు ముఖంలో సింహాద్రి అన్న మాటలకు భూతద్దం పెట్టిచూసినా చుక్క రక్తం లేనట్లు పాలిపోయింది. రాజారావు వెంటనే తమాయించుకుని సింహాద్రిని మనసులోనే తనకు తెలిసిన మొత్తం అన్నిరకాల బూతులతో తిట్టుకున్నాడు. తరువాత ఆ వేమన్న వంతులు అనే ఆయన్ని కూడా మామూలుగా తిట్టనారంభించారు.

రాజారావు ఆ మారు మూల వూర్లో గత వది నంవత్సరాలుగా, ఆ వూరి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా వనిచేస్తున్నాడు. ఆ వూరిలో వట్టుమని వెయ్యి గడవలు కూడా వుండవు. అలాంటి వూర్లో రాజారావు ఏకఛత్రాధివత్యం చెలాయించాడు. కారణం ఆ వూరి ప్రజలే గాకుండా ఆ వూరి ప్రెసిడెంట్, ఇతర పెద్దలు కూడా అమాయకులు కావడం కానీ 'వేమన్నవంతులు' అనబడే వెంకటరమణ ఆ వూరికి స్పెషల్ టీచర్‌గా నుండి వచ్చాక, చాలామంది వెంకటరమణ మాటకు






విలువ ఇవ్వసాగారు. వెంకటరమణ నిజానికి చదివింది స్పెషల్ తెలుగు బి.ఏ., బి.ఇడి. కానీ, కుటుంబ పరిస్థితుల వలన సెకండ్‌గ్రేడ్ టీచర్‌గా ఆ వూరి ఎలిమెంటరీ స్కూలుకు వచ్చాడు. వెంకటరమణ నంసారం భార్యా, ఒక ఐదు నెలల బాబు. వెంకటరమణ ఆ వూరివారికి 'వేమనపద్యాలు' ఉదహరిస్తూ చెబుతుంటాడు కాబట్టి, అతని పేరు 'వేమన్నవంతులు'గా మారింది. అలా మార్చింది కూడా రాజారావు అసూయనే. అయినా, 'వేమన్నవంతులు' అని పిలిచినా పలికే సౌమ్యుడు వెంకటరమణ. వెంకటరమణ వచ్చాక రాజారావుకు ఉచితంగా వచ్చే పాలు, పెరుగు, కూరగాయలు వగైరా కాస్త తక్కువయ్యాయనే చెప్పాలి. అదే రాజారావులో వెంకటరమణపై అసూయ కలగడానికి మొదటి కారణం. తరువాత ఇంకొన్ని కారణాలు రాజారావే స్వయంగా కల్పించుకున్నాడు. ఇక రాజారావు విషయానికొస్తే ఈయన నంసారం కూడా చాలా చిన్నదే - భార్యా, ఒకే ఒక్క పుత్రుడు. కొడుకు పేరు చిట్టిబాబు. పెళ్లికి ఎదిగాడు. కానీ, రాజారావే నిజానికి పెళ్లి కొడుకులా ముస్తాబై 'హరిజనవాడ'కు వెళ్తుంటాడు. హరిజనోద్ధరణకు కాదు. ఆవాడలో 'రత్తి' అనే పడచుతో 'చిన్నిల్లు' పెట్టుకొన్నాడు కనుక. రాజారావు వెంకటరమణను ఆ వూరి నుండి బదలీ చేయించాలని, రెండుసార్లు యం.డి.వే.కు కూడా కంప్లైంట్ ఇచ్చాడు. కానీ, అలాంటి మారుమూలపల్లెకు ఎవరూ రారు కాబట్టి యం.డి.వే. కూడా రాజారావు విన్నపాలు వినలేదు.

ఆ రోజు 'రెండవ శనివారం' శెలవు కావడంతో రాజారావు శుభ్రంగా తయారై అలా హరిజనవాడకెళ్ళొద్దామని బయలుదేరాడు. "ఒరే చిట్టీ! నేనలా బయటకు వెళ్ళొస్తాగానీ వాకిలేసుకో" అని కొడుకును కేకేసి బయటకు వచ్చాడు రాజారావు. బయటకు వచ్చిన రాజారావుకు ఆ వూరి ప్రెసిడెంట్ బ్రహ్మానాయుడు కన్పించాడు. ఆయనని చూసి రాజారావు పళ్ళికిలిస్తూ "ఎక్కడికో నాయుడుగారు బయలుదేరారు?" అన్నాడు.

"ఊరికే అలా పొలంవైపుకు. మరి మీరెక్కడికి?" నాయుడు ప్రశ్నించాడు.

"ఇవ్వాళ శెలవు గదా! ఊర్లోకి వెళ్దామని బయలుదేరా! హి:!హి:!"

"అలాగా!"

"అంతేగా మరి, ఎప్పుడూ ఇంట్లో రచ్చబెట్టి జనానికి బూతు సాహిత్యాన్ని చెప్పడానికి నేనేమన్నా వేమన్న వంతుల్నా?"

నోరు అష్టవంకర్లు త్రిప్పుతూ వెటకారంగా అన్నాడు రాజారావు.


"ఇప్పుడు వేమన్న వంతుల్నెందుకు మన మాటల్లోకి తీసుకురావడం. ఐనా ఆయనెందుకు బూతు చెబుతాడండి" కాస్త గొంతులో కాఠిన్యంతో అన్నాడు నాయుడు.

"హి!హి!" అంటూ పండ్లు బయటికి పెట్టి నవ్వుతూ "మీరు మరీనూ వేమన్న వంతుల్నే మన్నామీరు ఊరుకోరు సుమా!" అంటూ మనస్సులో నాయుడ్ని ఒక తిట్టుతిట్టాడు.

"మంచివాడు! అతన్నెందుకు మన మాటల్లోకి తీసుకురావడం అన్నాను అంతేగా!" అన్నాడు నాయుడు.

"మంచోడట, మంచోడు మీరు అమాయకులు కాబట్టి అందరూ మంచోళ్ళే అనుకుంటారు" అన్నాడు రాజారావు.

"ఆయన మంచివాడు కాబట్టే మీలా 'హరిజనవాడ'లో మకాం పెట్టలేదు. మిమ్మల్ని చూస్తుంటే ఒక పద్యం గుర్తుకు వస్తోంది.




ఇంటియాలు విడిచి ఇల జారకాంతల
వెంట దిరుగువాడు వెర్రివాడు
పంట చేను విడిచి పరిగయేరిన యట్లు
విశ్వదాభిరామ వినురవేమ" అని పద్యం చెప్పి!

"ఏం రాజారావుగారూ! ఈ పద్యం బాగుందా?" అని అడిగిన ఆయనకు విసురుగా ఇంట్లోకి వెళ్తున్న రాజారావు కన్పించడంతో నాయుడు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

"థూత్! నీ యవ్వ ఈ 'వేమన్నగాడు' వచ్చి అక్షరముక్క వచ్చిన ప్రతి వెధవకి పద్యాలు నేర్పుతున్నాడు. వానెమ్మ.. "తనకొచ్చిన రకరాకాల తిట్లు వదిలాడు రాజారావు, "ఏదో, ఊరికి ప్రెసిడెంట్ కదా అని మర్యాదకు పలకరిస్తే నాయుడు నాకొడుకు పద్యం పల్లిస్తాడా! వాని..."మళ్లీ రకరకాల తిట్లు.

"ఊరికే ఎందుకండీ అలా వాళ్ళని తిడతారు?" అంటూ వంటింట్లోంచి రాజారావు భార్య శాంతమ్మ వచ్చింది.

"ఏంటే అట్లా అంటావ్? కాకపోతే నాయుడు నా మీదే పద్యం చెబుతాడా లుచ్ఛా వెధవ" ఆవేశంతో అన్నాడు రాజారావు.

"అంతే లెండి. తప్పు లెన్నువారు - తమ తప్పు లెరుగరు" అంటూ ఆమె నవ్వుతూ వంటింట్లోకి వెళ్ళింది. ప్రస్తుతం రాజారావు తన భార్యని, భార్య బంధువులనీ, వారి వంశాన్ని మొత్తం తన రకరకాల తిట్లతో సన్మానిస్తున్నాడు.

★ ★ ★

"సార్! మా నాన్న మిమ్మల్ని నాయుడు గార్ని తెగతిట్టాడండి. పైగా మీరు చెడ్డోళ్ళు వ్యభిచారులు అన్నాడండి" అంటూ వయసు పెరిగినా బుద్ధి పెరగని అమాయకపు చిట్టి బాబు, తన ఇంట్లో పడక కుర్చీలో కూర్చుని ఉన్న వెంకటరమణకు జరిగినదంతా ఏకరువు పెట్టాడు. తమ ఇంట్లో వాళ్ళ నాన్న రాజారావు ఎలా ఎవర్ని తిట్టింది మొత్తం చెప్పాడు చిట్టిబాబు.

"దానిదేముందిలే చిట్టిబాబూ! మేము మంచి వాళ్ళమని నీకు తెలునుగా? అదే చాలు" అన్నాడు వెంకటరమణ [వేమన్న వంతులు] అక్కడే ఉన్న సింహాద్రి,"ఏంటండీ అలా అంటారు. వెళ్ళి నాల్గు తగిలించిరానా?" అన్నాడు.

"ఊరుకో సింహాద్రి! అసలు సార్ అలా అన్నారో లేదో' సౌమ్యంగా అన్నాడు వెంకటరమణ.

"సొంత కొడుకే చెబుతూంటే ఇంకేటండీ ఆలోచించేది" సింహాద్రి ఉగ్రంగా అన్నాడు.

"సార్! మళ్ళి నే చెప్పానని మానాన్నతో చెప్పకండేం"చిట్టి బాబు భయంగా అన్నాడు.

"ఛ! వూరుకోవేయ్. అలా చెబుతానా?" అంటూ, "సింహాద్రీ! కాస్త కోపం తగ్గించవయ్యా కుర్రాడు భయపడతాడు" అన్నాడు వెంకటరమణ.

"కాబోతే, ఏంటండీ! ఉత్తినే మిమ్మల్ని

అంటూంటే'' అన్నాడు సింహాద్రి. వెంకటరమణ మాత్రం తన సహజ ధోరణిలో ''అందుకే వేమన ఇలా అన్నాడు కాబోలు-

ముందరి పోటులు మాన్పను
మందెందైనాను గలదు మహిలోపలనే,
నిందల మాటలు మాన్పెడు
మందెందైనాను గలదె? మహిలో వేమా'' శ్రావ్యంగా పాడి విన్పించాడు వెంకటరమణ.

అంతలో అక్కడికి రాజారావు చిర్రుబుర్రులాడుతూ వచ్చి, ''ఏంటయ్యా! వెంకటరమణా! మా వాణ్ని ఇక్కడ కట్టి పారేశావు, వీడి కోసం నేవూరంతా వెతికి ఛస్తున్నా'' అన్నాడు.

''ఇప్పుడే వచ్చాడండీ! ఏం మా ఇంటికి రాక్కూడదూ ఏమిటి?'' కుర్చీలోంచి లేచి, నవ్వుతూ అన్నాడు వెంకటరమణ.

''ఎంతమాట, న్నేనలా ఎందుకంటానండి.పైగా మీ దగ్గరికి వస్తే కాస్త విజ్ఞానం కూడా వస్తుంది. అందులో ప్రత్యేకించి సెక్సు విజ్ఞానం...'వెటకారంగా అని, తానేదో 'పెద్దజోక్' వేసి నట్లు తన జోక్కు తానే నవ్వు కున్నాడు రాజారావు.

''నేనేం డాక్టర్ని కాదులెండి. సైక్రియాటిస్టుననలేకాదు. వాటి గురించి చెప్పడానికి'' నవ్వుతూనే అన్నాడు వెంకటరమణ.

''అబ్బో! ఎందుకు కాదు-మొన్న మాల రంగడికి వాత్సాయన కామసూత్రాలు' చెప్పారట. దాంతో వాడి కాపురం బాగు పడిందట. వాడే చెప్పాడు'' తన పరిశోధన విజయవంతమైనట్లు ఫోజుపెట్టి గర్వంగా అన్నాడు రాజారావు.

''ఏదో చదువురాని వాడు- వాడికి వివరించి చెప్పానంతే'' అన్నాడు వెంకటరమణ.

''అంతే అలాటోళ్ళకే చెప్పండి. మా వాడొస్తే మాత్రం వేమన పద్యాలు చెప్పండి. అసలే వాడికి తెలివీ లేదూ. తెలుగూరాదు'' అంటూ కొడుకును ''రా! రా! చిట్టీ!'' అని పిలిచాడు రాజారావు.

''అదేంటి పంతులు గారూ! తెలుగు మీరు నేర్పిస్తే పోలా? ఇక తెలివి అంటారా అదే వస్తుంది! హరిజన 'హడల్లో ప్రక్కనే ఉన్న సింహాద్రి ఎగతాళి చేశాడు రాజారావుని.

''ఆఁ! నా విషయానికేంలే. దీన్ని బట్టి చూస్తే రమణ గారూ! సింహాద్రికి ఏం విజ్ఞానం గురించి చెప్పలేదు కదండీ వేమన పద్యాల్లోని ముఖ్యమైన పద్యాలు అసలు చెప్పినట్లు లేదు'' అన్నాడు నొక్కి పలుకుతూ రాజారావు.

''ఏమిటో ఆ ముఖ్యమైన పద్యాలుకాస్త మాకూ చెప్ప రాదూ'' వెటకారంగానే అన్నాడు సింహాద్రి.

''ఇందాకన్నావుగా తెలివి హరిజన వాడలో వస్తుందని ఆ తెలివి గురించిన పద్యం-

వెర్రివానికైన వేషధారికినైన,
రోగికైన పరమ యోగికైన
స్త్రీల జూచినపుడు చిత్తంబు రంజిల్లు
విశ్వదాభిరామ వినురవేమ'' అని పద్యం చెప్పి, ''ఈ పద్యం తెలియకుంటే నీవేం మగాడివయ్యా




బాబూ!''


అని వెంకటరమణ అభిమాని అయిన సింహాద్రిని ఆయన ముందే దెబ్బకొట్టానని తెగ పొంగిపోతూ నవ్వేడు రాజారావు.

అంతలోనే సింహాద్రి. ''ముఖ్యమైన పద్యాలు తెలిసిన మీరు ఇంకో పద్యం మరచినట్టున్నారే'' అన్నాడు.

''ఏ పద్యమో చెప్పుమరి'' వెటకారంగా అన్నాడు రాజారావు. సింహాద్రి గళం విప్పాడు—

''రాజవరుల కెపుడు రణరంగముల చింత;
పరమ మునుల కెల్ల పరము చింత;
యల్ప నరుల కెల్ల నతివలపై చింత;
విశ్వదాభిరామ వినుర వేమ''

ఈ పద్యం వినగానే రాజారావు అగ్గిమీద గుగ్గిలమై పోయాడు, ''ఏమిటోయ్ సింహాద్రి! పెద్దా చిన్నా లేకుండా ఏదంటే అది వాగుతావా? నే ఈ వూరికొచ్చినపుడు పొట్టకోస్తే అక్షరమ్ముక్క రానివాడివి - నన్నే తిడతావా? చూస్తాను. నిన్నూ నీ వెనుక ఉన్న వాళ్లని'' అని వెంకటరమణ వైపు తిరిగి, ''ఇదిగో రమణగారూ! పెద్ద నాలుగు వేమన పద్యాలు, నాలుగు బూతు కూతలు నేర్చుకుని,




ఊరి జనానికి నేర్పుతూ హెడ్ మాష్టర్నైన నన్ను అనలేక ఈ అలగాజనంతో అన్పిస్తావా? నిన్ను చూస్తాను'' అంటూ తన కొడుకును లాక్కెళ్లాడు రాజారావు.

''సార్! నన్నపార్థం చేసుకోకండి, ప్లీజ్'' అంటూ ఏదో చెప్పబోయాడు వెంకటరమణ. కానీ, రాజారావు అప్పటికే అక్కడ లేడు.

''ఏమిటండీ! రాజారావలా వాగి వెళ్తే అలా చూస్తూ నిలబడ్డారు'' సింహ్రాద్రి అడిగాడు.


''ఏమంటాం? ఆయన పెద్దమనిషి. ఆయనననడం భావ్యం కాదు.''

''అది కాదండీ ఆయన మిమ్మల్ని తిట్టడం, మళ్లీ ఇక్కడికొచ్చి రంకెలేసి మనదే తప్పంటాడు'' అన్నాడు సింహాద్రి. అందుకు వెంకటరమణ నవ్వి ఇలా అన్నాడు—

''ఈ కపట నాటకంబును
ఈ కపటపు చదువులన్ని యింపు దలిర్పన్
యే కపటాత్ముడు సేసెనొ
యా కపటాత్మునకు మ్రొక్కి యలరుము వేమా''

* * *

రాజారావుకు ఆస్తి కూడా వెనుక చాలా ఉంది. చిట్టిబాబు ఒక్కడే కొడుకు కావడంతో ఆ వూరిలోని రంగారావు అనే ఆసామీ - చిట్టిబాబు కాస్త వెర్రిబాగుల వాడైనా - ఆస్తిని చూసి, ఆయన బిడ్డ తాయారునిచ్చి పెండ్లి చేశాడు. రాజారావు చాలా ఆర్భాటంగా, వైభవంగా పెండ్లి జరగడంతో సంతోషించాడు. కానీ మూడోరోజే రంగారావు బిడ్డ తాయారు 'చిట్టిబాబుకు మగతనం లేదు. నేను వాడితో కాపురం చేయను మొర్రో— అంది. అంతే రాజారావు ఇంట్లో చిట్టిబాబు, రంగారావు ఇంట్లో తాయారు ఒంటరివాళ్లయ్యారు. ఈ విషయం వూరంతా తెలిసింది. రంగారావు కట్నంతో పాటు పరువు నష్టపరిహారం కూడా తిరిగి చెల్లించాలని పట్టుబట్టాడు. ఊరిలోని కుర్రకారు చిట్టిబాబును ఏడ్పించేవారు. రాజారావు ముఖం బయటకు చూపలేకపోయాడు. ఈ విషయం తెలిసిన వెంకటరమణ రాజారావు ఇంటికెళ్లి, ''చూడండి మాష్టారూ! ఇలాంటివన్నీ 'సెక్స్' గురించి పూర్తి విజ్ఞానం లేకనే సంభవిస్తుంటాయి. అదే పాశ్చాత్య దేశాల్లో




అయితే పిల్లల తల్లిదండ్రులే పిల్లలకు 'సెక్స్ ఎడ్యుకేషన్' గురించి చెపుతారు. అలాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం ఇలాంటివి జరుగుతుంటాయి. ఇక మనలాంటి దేశాల్లో, పైగా 'సెక్స్' అంటేనే 'బూతు' అని ఎక్కువగా నమ్మే మన ఆంధ్రాలో, ఇలాంటి మారుమూల గ్రామంలో ఇది ఏలాంటి విషయమో మీకు తెలుసు. మీరు 'వర్రీ' అవకండి. చిట్టిబాబును నాతో పంపండి. పట్నంలో నా ఫ్రెండ్స్ చాలా మంది డాక్టర్స్ ఉన్నారు. వాళ్లనడిగి మంచి థెరపిస్ట్‌కు చూపిస్తాను. చిట్టిబాబును అందరిలాంటి మగాణ్ణి చేయగలను" అన్నాడు. రాజారావు ముఖంపై ఎవరో చెప్పుతో కొట్టినట్లయింది. వెంకటరమణ మంచి తనానికి రాజారావు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. వెంటనే వెంకటరమణ చేతులు పట్టుకుని, "రమణగారూ! నన్ను క్షమించండి. మిమ్మల్ని అనరాని మాటలెన్నో అన్నాను. మీ మంచితనంతో ఊరివాళ్లను ఆకట్టుకుంటే అదిచూడలేక ఈర్ష్యతో ఎన్నో తిట్టాను. నన్ను క్షమించండి" అని ఏడ్చాడు.

"ఛ! దానిదేముంది సార్! మీరు పెద్దవారు. ఇలా క్షమాపణ అడగడం బాగాలేదు. ముందు చిట్టిబాబును రెడీ చేయండి. నేనూ రెడీ అయి వస్తాను" అని వెంకటరమణ తన ఇంటికి వెళ్లాడు. పదిహేను రోజుల్లో చిట్టిబాబుని మామూలు మగాణ్ణి చేసి తీసుకువచ్చారు వెంకటరమణ. పట్నంలో ఓ మంచి సైక్రియాటిస్ట్ వద్ద చిట్టిబాబుకు ట్రీట్‌మెంట్ ఇప్పించారు. చిట్టిబాబు ఊరికి తిరిగొచ్చాక, తాయారుతో సుఖసంసారం చేయసాగాడు. చిట్టిబాబును ఏడ్పించిన వారంతా *'ఇదంతా విచిత్రమే!' అనుకున్నారు. పలువురు పలు* విధాలా ఆలోచించారు. అందరూ వెంకటరమణను దేవుణ్ణి చేసిపొగిడారు. రాజారావుకు వెంకటరమణను చూసినప్పుడంతా రాజారావుకు తెలిసిన వేమన పద్యాలలోని,

"మిరపగింజ జూడ మీద నల్లగనుండు,
కొరికి చూడలోన చురుకుమనును,
సజ్జనులగు వారి సారమిట్టుల నుండు
విశ్వదాభిరామ వినురవేమ" అనే పద్యం గుర్తుకు వచ్చేది.

ప్రస్తుతం రాజారావు కూడా వెంకటరమణను పలు రకాలుగా పొగడుతూ ఉన్నాడు. అది చూసి పూరివాళ్లు నవ్వుకొనేవారు.

★ ★ ★ ★

వెంకటరమణ వ్రాసిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష పాసై ఇంటర్వ్యూలో కూడా 'సెలెక్ట్' అయ్యాడు. దాంతో వెంకటరమణ ఈ మాస్టారు గిరికి రాజీనామా ఇచ్చి పట్నానికి కాపురం మారుస్తున్నాడు. ఊర్లో చాలామంది బాధపడ్డారు. సింహాద్రి, ప్రెసిడెంట్ పంపించిన మనుషులు సామాన్లు ఎడ్లబండిలో పెడుతున్నారు. రాజారావు అక్కడికి వచ్చాడు. "నేనే గనుక యం.డి.వో.ను అయి వుంటే మీ రిజిగ్నేషన్ని ఆక్సెప్ట్ చేసేవాణ్ణి కాదు రమణగారూ!" అన్నాడు.



## వాతావరణం

"మీరు రాసిన 'గాలి మేడలు' నవల ఎంతవరకూ వచ్చింది?" అడిగాడు విలేఖరి.

"కొంత వరకూ వచ్చింది కానీ ప్రస్తుతం తుపాను వాతావరణంతో బాగోలేక కాస్త రిలీఫ్ ఇచ్చాను" చెప్పింది రచయిత్రి.

*ఎల్.పి. చంద్ర (ధర్మవరం)*

"రమణ మాస్టారి బదలీ మాకందరికీ చాలా బాధగా ఉంది రాజారావుగారూ!" సింహాద్రి అన్నాడు.

"అవును రమణగారూ! మీరు వెళ్లడం నాకు కూడా చాలా బాధగా ఉంది" అన్నాడు రాజారావు.

"మిమ్మల్ని విడిచివెళుతూంటే నాకూ బాధగానే ఉంది సార్! కానీ తప్పదు. అన్ని సౌకర్యాలుండే పట్నం మేలుకదా! ముందుముందు నా పిల్లల ఎడ్యుకేషన్ కోసమైనా వెళ్లక తప్పేదికాదు కదా సార్!" అన్నాడు వెంకటరమణ.

"రమణగారూ! మీరు ఏమీ అనుకోనంటే మీ దగ్గరుండే 'వేమన పద్యాలు' పుస్తకం నాకివ్వగలరా?" అడిగాడు రాజారావు.

"దానికేముంది తీసుకోండి. నిజానికి 'వేమనపద్యాలు' దాదాపు మూడు వేల పైచిలుకు వున్న పుస్తకం ఇదే. చాలా పాతది. ప్రస్తుతం దొరకడం కష్టమే. కానీ, నా దగ్గరకంటే మీ దగ్గరే ఆ పుస్తకం భద్రంగా వుంటుందని నా నమ్మకం. ఉండండి ఇస్తాను" అంటూ పుస్తకాల పెట్టెలో నుండి తీసి ఇచ్చాడు వెంకటరమణ.

"ఈ పుస్తకమే మీకు 'వేమన్న పంతులు' అనే పేరు తెచ్చింది. కానీ ఎంతో సహృదయంతో ఈ పుస్తకాన్ని నాకు ఇస్తున్నారంటే..." రాజారావు కళ్లలో నుండి బాష్పాలు.

"నే వెళ్లాక జనానికి మీరు చెప్పండి 'వేమనపద్యాలు'. మీరు కూడా 'వేమన్న పంతులు' అవుతారు" అన్నాడు వెంకటరమణ.

"అందరూ 'వేమన్న పంతులు' కాలేరు రమణగారూ!" నిజాన్ని ఒప్పుకొన్నాడు రాజారావు. రమణ, రమణ కుటుంబం, బస్సు ఎక్కేదాకా వెళ్లి సాగనంపారు – రాజారావు, నాయుడు, సింహాద్రి, రంగారావు, చిట్టిబాబు మొదలైన వారెందరో. వెంకటరమణ లేకపోవడం వలన ఆ పూరి ప్రజలు చాలా బాధపడ్డారు. రాజారావు మాత్రం రెండు రోజులు 'వేమన పద్యాలు' పుస్తకాన్ని చేతుల్లోనే వుంచుకొని, మౌనంగా శోకించేవాడు. ఆ పుస్తకం తెరచి చదివేవాడు కాదు. రెండు రోజులు అయ్యాక గభాల్న ఆ పుస్తకం తెరచి చదివిన రాజారావుకి అనంకల్పితంగా కన్పించిన పద్యం అతన్ని ఆకర్షించిన పద్యం–

"పరనారీ దూరగుడై
పరధనముల కాన పడక పరహిత చారై
పరులలిగిన తనలుగక,
పరులెన్నగ బ్రతుకువాడు ప్రాజ్ఞుడు వేమా".

ఆ పద్యం అన్ని విధాలుగా వెంకటరమణకు సరిపోల్చ తగిన పద్యమని రాజారావు అనుకొన్నాడు. అనుకోకుండా రాజారావు కళ్లనుండి రెండు కన్నీటి బిందువులు ఆ పద్యంపై పడి, అందులో వెంకటరమణను అయనకు చూపిస్తున్నాయి. అంతటా ఆయనకు వెంకటరమణ 'విశ్వదాభిరాముడై' కనిపిస్తున్నాడు.

●